# హారర్ స్టోరీ



**కస్తూరి మురళీకృష్ణ**

# నేను చచ్చిపోతానా?

**ఆమెని చూడగానే మనసు పారేసుకున్నాను.**

**ఆమె నా జీవితం లోకి అడుగు పెట్టిన క్షణం, ఇంకా తాజాగా నా కళ్ల ముందు కదలాడుతోంది. నా పేషెంట్ల జాబితాలో ఆ రోజుకి ఆమె ఆఖరుది. అప్పటికే అలసిపోయి విసుగ్గా ఉన్నాను. ప్రపంచంలో ఎంతమంది మనుషులో అన్ని విచిత్ర మైన రోగాలు, భయాలు అనిపిస్తుంది. డబ్బులు బాగానే సంపాదిస్తున్నా, రోగులు, రోగాలు చూస్తుంటే జీవితం మీద విరక్తి కలుగుతుంటుంది. ఒకోసారి అన్నీ వదలి పారిపోయి, ఎవరికీ తెలియని, ఓ మూల ఏదో చిన్న ఉద్యోగం చేసుకుంటూ, హాయిగా సాహిత్యం చదువుతూ జీవితం గడిపేయాలనిపిస్తుంది. అలాంటి చిరాకు, విరక్తి కలగలసిన మూడ్‌లో ఉండగా, తలుపులు తోసి లోపలకు ప్రవేశించి, తిన్నగా నా హృదయంలోకి అడుగు పెట్టింది స్వప్న. ఆమెని, ఆమె అందాన్ని చూడగానే సర్వం మరచిపోయాను. 'జీవితం ఎంత అందమైనది కదా' అనిపించింది. అంతలోనే 'ఈమెకేమీ బాధనో' అన్న ఆలోచన వచ్చింది. మనసు విషాదమయమయింది.**

'నా పేరు స్వప్న. నేను ఇంగ్లీషు లెక్చరర్‌గా పని చేస్తున్నాను. నేను వివాహితను. కానీ విడాకులు తీసుకున్నాను. నాకో పిల్లవాడుండే వాడు. రెండేళ్ల వయసులో చచ్చిపోయాడు. ఇప్పుడు నన్ను అదే వ్యాధి పీడిస్తోంది. కానీ ఎవ్వరూ నమ్మటం లేదు' గబగబా చెప్పింది. చివరి మాటలంటూంటే ఆమె కళ్ళల్లో నీటి చుక్క తళుక్కుమంది.

'మీ పిల్లవాడు ఏ వ్యాధితో చనిపోయాడు?' మృదువుగా అడిగాను.

'వాడికి ఒళ్లంతా దురదలు వచ్చేవి. గోకితే ఎర్రగా అయ్యేది. ఏవో పాకుతున్నాయని. ఎప్పుడూ ఏడ్చేవాడు. డాక్టర్ల దగ్గరకు తీసుకెళ్లాను. ముందు అలెర్జీ అన్నారు. ఆ తరువాత అది చర్మవ్యాధి అన్నారు. ఎన్ని రకాల మందులిచ్చినా తగ్గలేదు. ఒక డాక్టరు నుంచి మరో డాక్టరు దగ్గరకు, ఒక స్పెషలిస్టు నుంచి మరో స్పెషలిస్టు దగ్గరకు తిరిగాను. చివరికి వ్యాధి అబ్బాయికి కాదు, నాకే అన్నారు' తలవంచుకుని చెప్పింది.

మన దేశంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పాశ్చాత్యుల తలదన్నే రీతిలో ఎదిగింది. కానీ విశ్లేషణ, అవగాహన, విషయాన్ని లోతుగా పరిశీలించాల్సిన తపనలు మాత్రం అభివృద్ధి చెందలేదు. అందుకే స్వప్నపై నా మనసులో సానుభూతి పెరిగింది.

'మీకేమి వ్యాధి అన్నారు?' అడిగాను.

'అదేదో అర్థం కాని పేరు చెప్పారు. పిల్లవాడికి లేని వ్యాధిని సృష్టించి తద్వారా నేను సానుభూతిని కొట్టేయాలని చూస్తున్నానన్నారు. నన్ను మానసిక



వైద్యుడి దగ్గరకు వెళ్లమని, అప్పుడే మీ అడ్రసు ఇచ్చారు'.

'మంచెసన్స్ బై ప్రాక్సీ' (Munchesens by proxy) అన్నాను నేను.

'ఆ... అదే పేరు చెప్పారు. కానీ నా పిల్లవాడు బాధపడటం చూస్తున్నాను. వాడి శరీరంపై ఎర్రటి గాయాలు చూస్తున్నాను. వాడు నొప్పి అని ఏడవటం నిస్సహాయంగా చూస్తున్నాను. అదంతా అబద్ధం. నేను సృష్టించిన కల్పన అని అంటే ఎలా ఒప్పుకుంటాను.

నాకు ఆమెపై సానుభూతి పెరిగిపోయింది. చాలామందికి తమ బాధను సరిగ్గా వ్యక్తం చేయటం రాదు. దాంతో లక్షణాలు చెప్తేనే తెలుసుకునే డాక్టర్లకు విషయం అర్థం కాదు. అందువల్ల రోగులకు తీవ్రమైన నష్టం కలుగుతుంది. తమ బాధను తేలికగా కొట్టేయటం వల్ల ఆవేదన కలుగు తుంది. ఆత్మస్థయిర్యం దెబ్బ తింటుంది. రోగి మరింత దిగజారతాడు.

'చివరికి ఒకరోజు, వాడి శరీరం మీద పుళ్లలోంచి పోగులు రావటం మొదలయింది.

మళ్లీ డాక్టర్లందరి చుట్టూ తిరిగాను. లాభం లేదు. ఏవేవో మందులిచ్చారు.

ఏవేవో పేర్లు చెప్పారు. ఓరోజు హఠాత్తుగా వాడి శ్వాస ఆగిపోయింది. ముఖం చేతుల్లో దాచుకుని చాలాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయింది.

నా మనసు బాధతో నిండిపోయింది. 'శరీరం నుంచి పోగులు రావటం' అనగానే నా మనసులో 'మోర్గెల్లన్స్ సిండ్రోమ్' (Morgellons Syndrome) అన్న పదం మెదిలింది. కానీ ఆ ఆలోచనను అణచుకున్నాను. అంతలో ఆమె ముఖం మీద నుంచి చేతులు తీసి, ఎర్రబడ్డకళ్లతో నా వైపు చూసింది. 'సారీ' అంది ముఖం తుడుచుకుంటూ.

'పర్లేదు' అన్నాను మృదువుగా.

''వాడు పోయి అయిదు నెలలవుతున్నప్పుడు నాకు శరీరంపై ఏవేవో పాకుతున్నట్టు అనిపించడం ఆరంభమయింది. కొన్నాళ్లకు ఎవో కొరుకు తున్నట్టు, దేనితోటో పొడుస్తున్నట్టు అనిపించసాగింది. డాక్టర్ల దగ్గరకు వెళ్లాలంటే భయం అనిపించింది. సానుభూతికోసం కొడుకుకు లేని రోగం సృష్టించినదాన్ని, ఇప్పుడు సానుభూతికోసం నేనే రోగం, సృష్టించుకుంటున్నానని అంటారు. అందుకే ఏ డాక్టరు దగ్గరకూ వెళ్లలేదు'.

నాకు ఆమెని దగ్గర తీసుకుని ఓదార్చాలన్న కోరిక బలంగా కలిగింది.

'కానీ కొన్నాళ్లకి మా అబ్బాయికి కనిపించినట్టే చర్మంపై ఎర్రపుళ్లు ఏర్పడ్డాయి. జాయింట్లు నొప్పులు పుట్టటం మొదలయింది. తల తిరుగుతోంది. అయోమయం ఎక్కువయింది. ఎటో వెళ్లాలనుకుంటాను. ఎటో వెళ్తాను. అసలు అక్కడకు ఎందుకువెళ్ళానో మరచిపోతాను. అప్పుడప్పుడు వస్తువులను గుర్తుపట్టటం కష్టమవుతోంది. చివరికి మొన్న ఒక రోజు కుడి కాలు కదపలేకపోయాను. ఇక లాభం లేదనుకుని డాక్టర్ దగ్గరకు వెళ్లాలని నిశ్చయించుకున్నాను. అప్పుడు ఇంతకుముందు ఓ డాక్టర్ ఇచ్చిన మీ అడ్రసు కంట పడింది. మామూలు డాక్టరు దగ్గరకు వెళ్లి అపహాస్యం పాలయ్యేకన్నా, ముందు మీ దగ్గరకు వచ్చి నా మానసిక స్థితి బాగానే ఉందని సర్టిఫికేట్ తీసుకుని, అప్పుడు డాక్టర్ల చుట్టూ తిరగటం మంచిదనిపించింది. అందుకని మీ దగ్గరకు వచ్చాను'.

దీర్ఘంగా నిట్టూర్చాను.

'నేనేమైనా చెప్పేముందు కొన్ని పరీక్షలు చేయాలి' అన్నాను.

ఆమె తల ఊపింది.

ఆమె చర్మంపై ఎర్రగా వర్తులాకారంలో పుళ్లున్నాయి. వాటిని జాగ్రత్తగా పరిశీలించాను.

'ఎరిథెమా మైగ్రాన్స్' అనుకున్నాను.

ఇంకొన్ని పరీక్షలు రాశాను.

'ఈ పరీక్షలు చేసుకుని రండి' చెప్పాను.

ఆమె నా వైపు సూటిగా చూసింది. 'నాది మానసిక వ్యాధినా?' అడిగింది.


చాలాసేపు ఆలోచించాను. ఉన్నదిఉన్నట్లు చెప్పేస్తేనే మంచిదని పించింది. నిట్టూర్చి చెప్పటం ఆరంభించాను.

'మీకున్నది మానసిక వ్యాధినో, సూక్ష్మపరాన్న జీవుల వల్ల కలిగే వ్యాధో ఇంకా వైద్యశాస్త్రం కచ్చితంగా నిర్ధారించలేదు. దీనిగురించి ఇంకా చర్చలు, పరిశోధనల వాదనలు సాగుతున్నాయి. మీ వ్యాధిని 'మోర్గెల్లన్స్ సిండ్రోమ్' అంటారు కొందరు. మరికొందరు 'వివరించలేని చర్మవ్యాధి' అంటారు. ఇంకొందరు 'భ్రాంతి వ్యాధి' 'డెల్యుషనల్ పారాసైటోసిస్' లేక 'ఎక్‌బోమ్స్ సిండ్రోమ్' అంటారు. ఆమె ముఖంలో అయోమయం కనిపించింది. 'ఇన్ని వ్యాధులా?' అంది. 'అంటేనే అర్థం చేసుకోవచ్చు మీ సమస్య ఏమిటో స్పష్టంగా వైద్యశాస్త్రానికే తెలియదని. 2002 సంవత్సరంలో మేరీ లైటా అనే ఆమె ఇలాంటి లక్షణాలున్న తన రెండేళ్ల కొడుకుని డాక్టర్లకు చూపిస్తే వాళ్లు నమ్మలేదు. మిమ్మల్ని అన్నట్టే ఆమె కూడా సానుభూతి కోసం నటిస్తోందన్నారు. కానీ ఆమె మౌనంగా ఊరుకోలేదు పరిశోధించింది. 1690లో థామస్ బ్రౌన్ అనే ఆయన రాసిన ఉత్తరంలో ఇలాంటి లక్షణాలున్న రోగాన్ని వర్ణించాడని చూపించి, ఈ వ్యాధికి 'మోర్గెల్లన్స్ సిండ్రోమ్' అని పేరు పెట్టింది. ఈ వ్యాధి పరిశోధన కని ఓ సంస్థను స్థాపించింది. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి లక్షణాలున్న రోగులను ఓ చోట చేర్చింది. దాదాపుగా 1200 మంది ఈ వ్యాధితో బాధ పడుతున్నారని తేలింది. అయితే, పుళ్లనుండి వెలువడే పోగులపై పరిశోధనలు జరిగాయి. అవి 'కృత్రిమమైనవి కావని తేలింది. అంతే తప్ప ఈ వ్యాధి గురించి, చికిత్స గురించి పరిశోధనలు ఆరంభస్థాయిలోనే ఉన్నాయి.'

'అంటే నాకు మందులేదా? నేను చచ్చిపోతానా?' అడిగింది.

నా గుండె కరిగిపోయింది. నన్ను నేను నియంత్రించుకుంటూ చెప్పాను.

'ఇంతకీ ఇదే మీ వ్యాధి అని నిర్ధారణ కాలేదు. కొన్ని పరీక్షలు చేయాలి. ఇది అలెర్జీ కావచ్చు. డయాబిటిక్, న్యూరోపతి వల్ల కావచ్చు. మోనోపాజ్ వల్ల రావచ్చు. స్కిన్ కాన్సర్ రావచ్చు. లేక ఇలాంటిదే అయిన లైమ్ వ్యాధి (Lyme disease) కావచ్చు.



లైమ్ వ్యాధి బాక్టీరియాల వల్ల వస్తుంది. ఆంటీ బయాటిక్స్‌తో పోతుంది. కాబట్టి ముందు వ్యాధి నిర్ధారణ కానీండి.

ఆ తరువాత చికిత్స గురించి ఆలోచిద్దాం. మీకు భౌతికంగా మందులతో మానసికంగా కౌన్సిలింగ్‌తో కలిసిన చికిత్స చేయాల్సి ఉంటుంది. కానీ ముందు రోగ నిర్ధారణ కానీండి. పరీక్షలు చేసుకుని రండి. అంతవరకూ ధైర్యంగా ఉండండి. మానసిక స్థయిర్యం సగం మందు' అన్నాను నవ్వుతూ'.

ఆమె కూడా నవ్వుతూ వెళ్లిపోయింది.

ఆ తరువాత ఆమె పరీక్షలు చేసుకుని రావటం, ఆమెకు డయాబిటిస్ లేదు. కేన్సర్ లేదు. బాక్టీరియా సమస్యలేదు అని తేలటం జరిగింది. ఇలా తరచు కలుస్తూండటం వల్ల ఆమె నాకు దగ్గరగా వచ్చింది.

రోగులతో మానసికంగా ఆ అనుబంధం ఏర్పరచుకోకూడదు. తెలిసి కూడా నా మనసును నియంత్రించలేకపోయాను. ఆమెతో నా వృత్తితో సంబంధం లేకుండా అనుబంధం పెంచుకున్నాను.

ఆమె చాలా తెలివైనది. డాక్టరు వృత్తిలో పడటం వల్ల మరుగున పడిన నా సాహిత్య పిపాసి ఆమె పరిచయంతో మళ్లీ జాగృతమయింది.

మేమిద్దరమూ తరచు కలుస్తూ సాహిత్యం గురించి చర్చించుకునే వాళ్లం. మరోవైపు ఆమె వ్యాధిని ఎదుగుదలను, జరుగుతున్న మార్పులను గమనిస్తూ వచ్చాను.

'మీతో మాట్లాడుతున్నంత సేపూ నన్ను నేను మరచిపోతాను. మీరు వెళ్లిన తరువాత బాధలన్నీ గుర్తుకు వస్తాయి' అంది ఒక రోజు నాతో.

ఓరోజు రాత్రి హఠాత్తుగా ఫోను చేసింది. 'నాకు భయం వేస్తోంది' అంది.

'ఏమైంది?' అడిగాను.

'మీ వైద్యం వల్ల చర్మంపై పుళ్లు తగ్గిపోయాయి. కానీ... ఇప్పుడే చూసుకున్నా ఆ పుళ్లున్న స్థానంలో పోగులు పెద్దవి ఉన్నాయి. చేతితో లాగుతూంటే ఊడి వస్తున్నాయి' చెప్పింది ఏడుస్తూ.

'వాటిని పారేయకు. దాచి ఉంచు. ల్యాబ్‌కు పంపుదాం' అని ధైర్యం చెప్పి పెట్టేశాను. కానీ నేను ఆమెకు 'చికిత్స సరిగ్గా చేస్తున్నానా?' అన్న అనుమానం వచ్చి అమెరికాలో ఈ విషయం పరిశోధన చేస్తున్న వారిని సంప్రదించాను. సలహాలు తీసుకు

న్నాను.

మరుసటి రోజు ఆమె 'పోగుల మూటను' నా ముందు పెట్టింది. పరీక్షగా చూశా. మామూలు దారాల్లా ఉన్నాయి. కానీ దారాలు కావు.

'పుళ్లు దురదగా అనిపిస్తాయి. గోకుతాము. దాంతో చర్మం రేగుతుంది. రేగిన చర్మం ఇలా పోగులు పోగులుగా విడిపోతుంది' వివరించాలని ప్రయత్నించాను.

'డాక్టర్... నా దగ్గర దాచకండి. నేను చచ్చిపోతానా?' అడిగింది.

నేను మౌనం వహించాను.

ఆమె వెళ్లిన తరువాత నాకుతెలిసిన మానసిక వైద్యులను సంప్రతించాను. కేసు వివరాలు పంపాను.



## మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

### చాకొలేట్

హైవేమీద శరవేగంగా దూసుకుపోతున్న పోలీస్‌కార్ రోడ్డు పక్కన థంసప్ చూపిస్తున్న యువకుణ్ణి చూసి ఆగింది.

''థాంక్స్ ఫర్ ది లిఫ్ట్'' అంటూ కారెక్కాడు యువకుడు.

''ఎందుకింత వేగంగా పోతున్నారు సార్? ఏమైనా ప్రమాదం జరిగిందా?''

''బ్యాంక్ దోపిడీకి ప్రయత్నించారు కొందరు. దొంగలందరూ ఓ నల్ల కారులో పారి పోతున్నారు. ఛేజ్‌చేసి పట్టుకోవాలి''

''అలాగా, నేన చూశానా కారు. అందులో నలుగురు ముసుగు మనుషులు కని పించారు'' అంటూ ఓ చాకొలేట్ బార్ తీసి ముక్కతుంచి నోట్లో వేసుకుని పక్కనున్న పోలీ సాఫీసర్‌కు ఆఫరు చేశాడు యువకుడు.

''నో థాంక్స్'' అన్నాడు పోలీస్.

''నేను గంటసేపట్నించీ ఎండలో నిల్చు న్నాను. బాగా వేడిగా వుందివ్వాళ. టెంపరేచర్ 90 (ఫారన్‌హీట్) దాటి వుంటుంది సార్. వాళ్లు కుడి వైపుకు పారిపోయారు'' అంటూ చెప్పుకు పోతున్నాడు యువకుడు.

కారు ఎడం వైపుకు తిరిగింది.

''అదేమిటి సార్. ఇటెక్కడికి?''

''పోలీస్‌స్టేషన్‌కు. నువ్వూ ఆ గ్యాంగ్‌లో మెంబర్‌వే'' అన్నాడు పోలీస్ డిటెక్టివ్.

అతడికి దొరికిన 'క్లూ' ఏమిటి?

సమాధానం: గంటసేపు సుమారు 90 ఎండలో నిల్చుంటే చాకొలేట్ మెత్తబడి పోతుంది. తుంచటం వీలు పడదు.

ఇంకొందరు విదేశాలలోని నిపుణులతో సంప్రతించాను.

ఇంతలో స్వప్న మళ్లీ ఫోను చేసింది.

'డాక్టర్... నా చర్మం పోగులుపోగులుగా విడిపోతున్న భావన కలుగు తోంది...' అంది ఏడుస్తూ ధైర్యం చెప్పాను. 'నేనిచ్చిన మందులు వాడు తగ్గిపోతుంది' అన్నాను.

'డాక్టర్.... మీరు నా దగ్గరఉంటే ధైర్యంగా ఉంటుంది. రాగలరా?' అడిగింది బేలగా.

ఒక్కక్షణం ఆలోచించాను. 'వస్తాను. కానీ క్లినిక్ మూసేసరికి ఆలస్యమవు తుంది' అన్నాను.

'ఎంత రాత్రయినా ఫరవాలేదు. రండి' అంది.

క్లినిక్‌లో సరిగ్గా పని చేయలేకపోయాను. నా మనసును స్వప్న బాధిస్తోంది. ఆమె వ్యాధిని ఎలా నయంచేయాలో తెలియటం లేదు. అలాగని ఏమీ చేయకుండా ఉండలేను.

క్లినిక్ మూసేసి ఆమె ఇంటికి బయలుదేరాను. నా సాంగత్యం వల్ల ఆమె ఆత్మస్థయిర్యం పెరుగు తుంది కాబట్టి నేను. ఆమె ఇంటికి వెళ్లటం సబబేనని మనసుకు సర్దిచెప్పుకున్నాను.

తలుపు తట్టకముందే తెరచుకున్నాయి.

ఎదురుగా వర్ణనాతీతమైన పరమాద్భుతమైన అందం మానవ ఆకృతి దాల్చి వేసింది. వెన్నెల కారణం స్త్రీ ఆకృతి దాల్చినట్టుంది. నా సౌందర్య భావన స్వప్నం, స్వప్నరూపం ధరించి ఎదురుగా నిలుచున్నట్టు నిలుచుంది స్వప్న.

నవ్వింది. లోపలకు రమ్మంది.

ఏదో లోకంలో ఉన్నవాడిలా ఆమె వెంట వెళ్లాను.

'నేను మీకు అబద్ధం చెప్పాను. మీ వైద్యంవల్ల నా బాధ పూర్తిగా తగ్గిపోయింది. కానీ తగ్గిపోయిందంటే మీరు రారని అబద్ధం చెప్పాను' అంటూ నవ్వింది.

వెన్నెల చల్లగాలిలా మారి చుట్టుముట్టినట్టు ఉక్కిరిబిక్కిరి అయ్యాను.

'నేనిప్పుడు ఫ్రీ. నాకు ఎలాంటి వ్యాధి లేదు. మానసిక రోగిని కాను నేను. నాకు ఎలాంటి శారీరక వ్యాధి లేదు' థాంక్యూ డాక్టర్ అంటూ నా రెండు చేతులు పట్టుకుని చుంబించింది. తలెత్తి నా వైపు చూసి నవ్వింది.

ఆమె కళ్లల్లో అనంత నీలి సముద్రాలు కనిపించాయి. తల తిరిగింది. ఎలా జరిగిందో తెలియదు. నా పెదవులు, ఆమె పెదవులు తాకాయి.

అంతే... నాలో ఆవేశపుటగ్ని పర్వతం బద్దలయింది. నాలో అంత ఆవేశం ఉందని నేనెన్నటికి ఊహించలేదు. నా పెదవులతో ఆమె పెదవులను నలిపేయసాగాను. తన్మయత్వంతో ఆమె చేస్తున్న శబ్దాలు నన్ను మరింత ఉద్రేక పరచాయి. నేను మనిషిని కాదు. చెలరేగే ఉద్రేకాన్నయి పోయాను.

ఇంతలో....

నా చేతులకు ఆమె చర్మం తగిలింది. అది మృదువుగా లేదు. గరకు గరుకుగా ఉంది.

నా పెదవుల క్రింద మధురంగా ఉన్న ఆమె పెదవులు బీట వారినట్టు అనిపించింది. ఒక్కసారిగా ఈ లోకంలోకి వచ్చి పడ్డాను. కళ్ల తెరచి చూశాను.

పెద్దగా కేక పెట్టి ఆమెను వదిలేశాను.

స్వప్న సుఖంతో శబ్దాలు చేయటం లేదు. భరించలేని బాధతో మూల్గుతో మెలికలు తిరిగిపోతోంది. లుంగలు చుట్టుకు పోతోంది.

నా కళ్లముందే ఆమె శరీరం పోగులు పోగులుగా విడిపోతోంది.

ఆమె శరీరం నుండి వెంట్రుకలలా పోగులు పొడుచుకువస్తున్నాయి. భూకంపం సమయంలో భూమి చీలిపోయినట్టు ఆమె చర్మం పోగులుగా వేరయిపోతోంది.

చేతులు, కాళ్లు, ముఖం... ఒకటేమిటి, బట్ట నుండి దాన్ని ఏర్పరచిన పోగుల ఒక్కటొక్కటి లాగుతున్నట్టు, ఆమె చర్మాన్ని ఏర్పరచిన సూక్ష్మ పోగులను ఎవరో కొన్ని లక్షల చేతులతో ఒకటొకటిగా లాగుతున్నట్టుంది. భరించరాని బాధతో ఆమె కేకలు పెడుతోంది. వర్ణనాతీతమైన వేదనతో వణకిపోతోంది.

నాకేం చేయాలో తోచలేదు. నా శరీరం సర్వం వణుకుతోంది.

ఒక్కక్షణం క్రితం నా చేతులలో నిండిన అందమైన ఆకారం, అలవికాని భయంకరమైన బాధతో పేలిపోతుంది.

అప్పుడు గమనించాను. నా నోటికి కొన్నిపోగులు అంటుకుని ఉన్నాయి.

కడుపులో తిప్పసాగింది.

స్వప్న ముఖం పోగులమయమయిపోయింది. ఆమె కళ్లు నన్నే చూస్తున్నాయి.

అందులోని భావం అర్థం కావటం లేదు.

'రక్షించమన్నట్టు' చేయిసాచింది. కానీ అక్కడ చేయలేదు. పోగులు... పోగులు... గాలికి కొన్నిపోగులు ఎగురుతున్నాయి. గదంతా ఎగిరే దూది లాంటి తేలిక పోగులతో నిండిపోయింది.

నేనిక భరించలేక పోయాను.

బయటకు పరుగెత్తుకు వచ్చాను. భయంకరమైన వాంతి చేసుకున్నాను. ఒళ్లంతా నీరసమైపోయింది.

ఎలా కార్లో చేరానో తెలియదు. కారు వేగం అందుకున్నాక చల్లగాలి శరీరాన్ని తాకింది. అప్పుడు ఈ లోకంలోకి వచ్చిపడ్డాను. శరీరం మొత్తం వణుకుతోంది. స్టీరింగ్‌ని పట్టుకున్న చేతులు బలహీనంగా ఉన్నాయి.

కాస్సేపటికి నా మీద నాకు నియంత్రణ వచ్చింది. ఏం జరిగిందో నా ఊహకు అందటం లేదు. జరిగింది కలనో, నిజమో అర్థం కావటం లేదు.

ఇంతలో... మెల్లగా... అతిమెల్లగా ఆ భావన కలిగింది.

ఏదో జీవి నా చర్మం లోపల పాకుతున్నట్టు అనిపించింది.

ముందు భ్రమ అనుకున్నాను. స్వప్న పరిస్థితికి నా మనస్సు సానుభూతిగా స్పందిస్తోందనుకున్నాను.

కానీ... నాది భ్రమ కాదు... శరీరం మొత్తం అణువణువునా ఎన్నో సూక్ష్మ జీవులు పాకుతున్న భావనకలుగుతోంది.... అవి పాకుతున్నాయి.... కొరుకుతున్నాయి... 'నేను చచ్చిపోతానా?'

★